సేవాలాల్ జయంతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడులో బంజారా భవన్ నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, ఫిబ్రవరి 28 : మునుగోడు మండల కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గ స్థాయి సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తండా అభివృద్ధికి అధిక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా 2 వేల మంది హాజరవుతారనుకుంటే రెండు వందల మంది కూడా హాజరుకాకపోవడంతో నిర్వాహకులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే గిరిజనులతో కలిసి పూజలు చేశారు. అలాగే మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థిని రాజేశ్వరి నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొన్నందున ఆమెకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున రూ.25 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు తాడూరి వెంకట్‌రెడ్డి. గుత్తా ఉమాదేవి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఏపూరి సతీశ్, నాయకులు నర్సింహ, లింగస్వామి, భిక్షపతి నాయక్, శ్రీనునాయక్, బాలూనాయక్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ ప్రగతికి మాస్టర్ ప్లాన్

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రగతికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి వచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సూచించారు. పట్టణ కేంద్రంలో ప్రధానంగా మంచినీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ దవాఖానలో సరిపడా వైద్యులు, సిబ్బంది లేరని, మందులు కూడా సరిపడా రావడం లేదని వైద్యాధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అమరేందర్, కిరణ్‌కుమార్

కాంగ్రెస్, బీజేపీది లోపాయికారి ఒప్పందం

- 17 మంది కౌన్సిలర్లు ఉన్నా వైస్ చైర్మన్ పదవికి పోటీపడని కాంగ్రెస్
- బీఆర్ఎస్ నాయకులు అమరేందర్, కిరణ్‌కుమార్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 28 : కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని కాంగ్రెస్ చైర్మన్, బీజేపీ వైస్ చైర్మన్ పదవులు దక్కించుకున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొలుపుల అమరేందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు 17 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఉన్నా వైస్ చైర్మన్ పదవికి పోటీ పెట్టకుండా ఉండడంతో ఆ పార్టీలు ఎంత సఖ్యతతో ఉన్నాయో అర్థమవుతుందన్నారు. ఏడుగురు కౌన్సిలర్లు ఉన్న బీజేపీకి వైస్ చైర్మన్ పదవి దక్కిందంటే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని తేటతెల్లమైందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వార్డుల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపి ఎక్కువ ఓట్లు వచ్చేలా చేయడంతోనే కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ మద్దతు ఇచ్చినందుకు ప్రతిఫలంగా కాంగ్రెస్ బీజేపీ రుణం తీర్చుకుందన్నారు. బీఆర్ఎస్‌పై ఎన్ని కుట్రలు చేసినా ప్రజల కోసమే పని చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, గోపాల్, ఇక్బాల్ చౌదరి, మహేశ్ పాల్గొన్నారు.

యూడైస్‌లో పూర్తి వివరాలు నమోదు చేయాలి

- జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీహరి అయ్యంగార్

ఎమ్మార్సీలో ఆన్‌లైన్ పనులను పరిశీలిస్తున్న జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీహరి అయ్యంగార్

బొమ్మలరామారం, ఫిబ్రవరి 28 : పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీహరి అయ్యంగార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో జరుగుతున్న ఆన్‌లైన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రాప్ బాక్స్ క్లియరెన్స్‌పై ఎదురవుతున్న సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మిస్ కో ఆర్డినేటర్ శిరీష, ఎల్‌డీఏ ప్రియాంక, సీఆర్పీ శ్రీహరి, మెసెంజర్ మధు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉప్పలయ్య

ఉప్పలయ్యను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య

రాజాపేట, ఫిబ్రవరి 28 : మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొంగోని ఉప్పలయ్యను మాజీ ప్రజా ప్రతినిధుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకరయ్య నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, బూరుగు భాగమ్మా నర్సిరెడ్డి, ఎర్రగుంట లావణ్యాజశ్వంత్, రహీం, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 28 : మండలంలోని కూరెళ్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కట్ట రమేశ్, ఉపాధ్యాయులు సత్తయ్య, భిక్షం, మల్లేశ్ పాల్గొన్నారు.

బీబీనగర్ : ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఆలేరు రూరల్ : కొలనుపాక జడ్పీహెచ్ఎస్‌లో సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజాపేట జడ్పీ హైస్కూల్‌లో సీవీరామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు తాము తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. పలువురు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మానవాళి అభివృద్ధికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. వివిధ అంశాలను వెలుగులోకి తీసుకొచ్చిన శాస్త్రవేత్తల సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుర్కపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన పోషక పదార్థాలను రుచి చూస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్ : ట్రినిటీలో ప్రయోగాలను తిలకిస్తున్న ఎంజీయూ ప్రొఫెసర్ ప్రశాంతిరెడ్డి

వలిగొండ : మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

భువనగిరి కలెక్టరేట్ : అనంతారం గురుకుల పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

మోత్కూరు : పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భువనగిరి అర్బన్ : కృష్ణవేణి పాఠశాలలో ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బహుజన ప్రజాశక్తి పోచంపల్లి పట్టణ కమిటీ

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 28 : బహుజన ప్రజాశక్తి పట్టణ కమిటీని రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భరత్‌భూషణ్, ఉపాధ్యక్షులుగా డబ్బింగ్ ప్రేమ్‌కుమార్, కొండమడుగు శివరాజ్, దేవరాయ భిక్షపతి, రావుల అనిల్, ప్రధాన కార్యదర్శిగా ముశం మధుసూదన్, సహాయ కార్యదర్శిగా సైదుగాని స్వామి, కార్యదర్శులుగా పొనమోని శ్రీకాంత్, నల్ల లింగస్వామి, బాబు, శివ, శ్రీను ఎన్నికయ్యారు.

అదనపు కలెక్టర్ వీరారెడ్డి బదిలీ

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డిని బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరారెడ్డిని హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

4న మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

మోత్కూరు, ఫిబ్రవరి 28 : మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక మార్చి 4న జరుగనున్నది. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసంపై ఈ నెల 9న ప్రత్యేక సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. కాగా, మార్చి 4న ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు, ఈ మేరకు కౌన్సిలర్లకు నోటీసులు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏకు గాయాలు

మోత్కూరు, ఫిబ్రవరి 28 : మండలంలోని అనాజిపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పొడిచేడు వీఆర్ఏ పోతరబోయిన నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం నర్సయ్య స్వగ్రామం పొడిచేడుకు బైక్‌పై వెళ్తుండగా అమ్మనబోలు నుంచి పశువులతో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ఢీ కొట్టింది. ప్రమాదంలో నర్సయ్యకు కాలు విరిగింది. చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

నేరాలపై అవగాహన

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 28 : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని షీ టీమ్ ఎస్ఐ ప్రవీణ్ సూచించారు. బుధవారం మండలంలోని ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

భువనగిరి కలెక్టరేట్ : అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

వలిగొండ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు వెంకట్‌రెడ్డి

- వ్యక్తిత్వ వికాస నిపుణుడు పూర్ణశశికాంత్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటి సాధనకు ముందుకు సాగాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు పూర్ణశశికాంత్ సూచించారు. బుధవారం మండలంలోని బొల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో ఇబ్బందులకు గురికాకుండా అభద్రతాభావానికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు. సందేహాలు, భయాలను వీడి పరీక్షలపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు విజయేందర్‌రెడ్డి, స్వామి, పద్మలత, మున్ని, ఉపేందర్ పాల్గొన్నారు.

ఒత్తిడికి లోను కావద్దు : వెంకట్‌రెడ్డి

వలిగొండ : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకావద్దని ఇంఫ్యాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ దేశిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రెడ్లరేపాక, పహిల్వాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగధారి భిక్షపతి, ధనలక్ష్మి, వరమ్మ, గురుప్రసాద్, కృష్ణమూర్తి, విమల, ఆండాలు, సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

రామన్నపేటలో టైలర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య తదితరులు

రామన్నపేట, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ టైలర్స్ డే వేడుకలను టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్‌చేసి టైలర్స్ అసోసియేషన్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఐ, ఎస్ఐతోపాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పున్న జగన్‌మోహన్, అప్పం లక్ష్మీనర్సు, బడుగు రమేశ్, సాల్వేరు అశోక్, టైలర్స్ అసోసియేషన్ నాయకులు నజీర్, వేణుగోపాల్, షబ్బీర్, పిట్టల శ్రీను, అతీఖ్, రవి, సాయికుమార్, తబ్రెజ్, కిషన్, కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

పంట రుణాలు రెన్యూవల్ చేయించుకోవాలి

- ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి

మోత్కూరు, ఫిబ్రవరి 28 : సహకార సంఘంలో తీసుకున్న పంట రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాలని మోత్కూరు రైతు సేవా సహకార సంఘం తీర్మానించింది. బుధవారం సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.వెయ్యి చెల్లించి సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సంఘం ఆవరణలో నిర్మాణం చేస్తున్న గోడౌన్ పనులను పూర్తికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సంఘం ఉపాధ్యక్షుడు పేలపుడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు పురుగుల మల్లయ్య, గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కారుపోతుల ముత్తయ్య, సామ పద్మారెడ్డి, బుషిపాక సుజాత, తాళ్లపల్లి స్వామి, సంఘం కార్యదర్శి కొణతం వరలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ నిర్మలావెంకటస్వామి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 28 : మండలంలోని బల్లేపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ నరాల నిర్మలావెంకటస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. ఎంపీటీసీ చంద్రకళావీరస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 28 : మండల కేంద్రానికి చెందిన ఎలిమినేటి స్వామి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సహకారంతో సమకూర్చిన రూ.5 వేల నగదును మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేశ్ అందజేసి సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు మల్లేశ్, మురళీకృష్ణ, భాస్కర్, అనిల్, సత్యనారాయణ, సత్తయ్య ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

లింగేశ్వర పెట్రోల్ బంక్‌లో కొలతలను పరిశీలిస్తున్న జిల్లా తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు

బొమ్మలరామారం, ఫిబ్రవరి 28 : పెట్రోల్ బంక్‌లు, వేబ్రిడ్జిల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి కందగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫిల్లింగ్ స్టేషన్లు, వే బ్రిడ్జిల్లో తూనికలు, కొలతల్లో పాటిస్తున్న ప్రమాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు తప్పుడు కొలతతో డీజిల్, పెట్రోల్ పంపిణీ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూ నికలు, కొలతల జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని రాంనగర్‌కాలనీలో గల పైళ్ల దామోదర్‌రెడ్డికి చెందిన కిరాణాషాపులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.60 వేలు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బొమ్మలరామారం, ఫిబ్రవరి 28 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎయిమ్స్ బీబీనగర్ ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీతారామచంద్ర ఆలయ కమిటీ

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని జలాల్పూర్‌లో పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేసారం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుండ్ల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా పున్న నరేశ్‌కుమార్, కోశాధికారిగా కంది మహేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా పాలకూర్ల నవీన్‌గౌడ్, ధర్మకర్తలుగా దోర్నాల నర్సింహ, పాలకూర్ల ఉపేందర్, జిలకపల్లి నర్సిరెడ్డి, శాపాక స్వామి, గంగిరెడ్డి మాధవరెడ్డి, నిమ్మ శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు.